# సాక్షి నల్లగొండ

గురువారం, 19, అక్టోబర్, 2023






**మా బతుకులు మార్చాలి**
మేనిఫెస్టోలో లేబర్ బంధు ప్రకటించి మా బతుకులు మార్చాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. - IIలో



**వైభవంగా నిత్య కల్యాణం**
మట్టపల్లి క్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - IVలో



**భవిష్యత్తును మార్చేది సోషలిజమే**
దేశ భవిష్యత్తును మార్చేది సోషలిజమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. - IVలో

## ఎనిమిది సెగ్మెంట్లలో ఆమే.. నిర్ణేత!

◆ 12 నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 28,29,357 ◆ అందులో మహిళా ఓటర్ల సంఖ్య 14,25,071



ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. నాలుగు నియోజకవర్గాల్లో మాత్రం పురుషుల ఓట్ల సంఖ్య కొద్దిగా ఎక్కువ ఉంది. ఎన్నికల్లో గెలుపోటములను, పార్టీల భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి మహిళలకే ఉండటంతో అన్ని రాజకీయ పార్టీలు వారి ఓట్లను రాబట్టుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. – సాక్షి ప్రతినిధి, నల్లగొండ

### సగానికి పైగా స్థానాల్లో మగువలదే పైచేయి

- అభ్యర్థుల గెలుపోటముల్లో వారే కీలకం
- మహిళల ఓట్లను రాబట్టుకునేందుకు ప్రధాన పార్టీల వ్యూహాలు
- మేనిఫెస్టోల్లో వారికి ప్రత్యేక హామీలు
- ప్రచార సభలకు మహిళలు ఎక్కువగా వచ్చేలా అభ్యర్థుల కార్యాచరణ

ఉమ్మడి జిల్లాలో మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. 12 నియోజకవర్గాల్లో మొత్తం 28,29,357 మంది ఓటర్లలో పురుషులు 14,04,111 మంది, మహిళా ఓటర్లు 14,25,071 మంది ఉన్నారు. ఇక ట్రాన్స్‌జెండర్లు 195 మంది ఉన్నారు. ఇంట్లో ఓట్లను కూడా మహిళలు ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో అన్ని రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. మహిళా ఓటర్లలో సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా ఉండనుండటంతో వారిని ఆకట్టుకునేలా ప్రసంగాలు, ప్రచార ఏర్పాట్లతో అభ్యర్థులు సిద్ధమయ్యారు.

**అత్యధికంగా 5,366 మంది**

పురుషుల కంటే మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న 8 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గంలో 421 నుంచి మొదలుకొని 5,366 మంది ఉన్నారు.

**మిగతా చోట్ల ఐదు వేలే తక్కువ..**

ఉమ్మడి జిల్లాలోని మిగతా నాలుగు నియోజకవర్గాల్లో మహిళ ఓటర్ల సంఖ్య చాలా తక్కువ ఏమీ లేదు. అన్ని నియోజకవర్గాలు కలిపితే కేవలం 5వేల మంది పురుషుల కంటే మహిళ ఓట్లు తక్కువగా ఉన్నారు. అందులో దేవరకొండ, మునుగోడు, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాలు ఉన్నాయి.

మొత్తంగా చూస్తే ఆ నియోజకవర్గాల్లో 26,477 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ప్రత్యేకించి ఆ ఎనిమిది సెగ్మెంట్లలో మొత్తం ఓటర్లు 18,63,122 ఉంటే అందులో 9,18,253 మంది పురుషులు, 9,44,730 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 5366 మంది ఎక్కువ ఉన్నారు. నల్లగొండలో 4,839 మంది, నకిరేకల్‌లో 421 మంది, నాగార్జునసాగర్‌లో 3,334 మంది, మిర్యాలగూడలో 3,265, సూర్యాపేటలో 3,938, కోదాడలో 4,760, భువనగిరిలో 554 మంది మహిళా ఓటర్లు పురుషులకంటే ఎక్కువగా ఉన్నారు.

**మహిళా ఓటర్లు అధికంగా ఉన్న నియోజకవర్గాల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| నల్లగొండ | 1,16,487 | 1,21,326 | 53 | 2,37,866 |
| నకిరేకల్ | 1,22,021 | 1,22,442 | 4 | 2,44,467 |
| నాగార్జునసాగర్ | 1,12,613 | 1,15,947 | 20 | 2,28,580 |
| మిర్యాలగూడ | 1,11,169 | 1,14,434 | 23 | 2,25,626 |
| సూర్యాపేట | 1,15,638 | 1,19,576 | 17 | 2,35,231 |
| హుజూర్‌నగర్ | 1,18,664 | 1,24,030 | 17 | 2,42,711 |
| కోదాడ | 1,16,257 | 1,21,017 | 15 | 2,37,289 |
| భువనగిరి | 1,05,404 | 1,05,958 | 0 | 2,11,362 |
| మొత్తం | 9,18,253 | 9,44,730 | 149 | 18,63,132 |

**ఈ నియోజకవర్గాల్లో మహిళలు తక్కువ**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| దేవరకొండ | 1,22,161 | 1,19,291 | 15 | 2,41,467 |
| మునుగోడు | 1,24,473 | 1,23,996 | 5 | 2,48,474 |
| తుంగతుర్తి | 1,24,836 | 1,23,722 | 8 | 2,48,566 |
| ఆలేరు | 1,14,388 | 1,13,332 | 18 | 2,27,738 |
| మొత్తం | 4,85,858 | 4,80,341 | 46 | 9,66,245 |

**సభలకు వచ్చేలా ప్రణాళికలు..**

ఇప్పటికే ప్రచారంలోకి దిగిన నేతలు తమ వెంట ఎక్కువగా మహిళలు ఉండేలా చూసుకుంటున్నారు. సభలు, సమావేశాలకు ఎక్కువ మంది మహిళలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించకుంటున్నారు. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులను రంగంలోకి దింపుతున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చెప్పించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**అతివలే లక్ష్యంగా మేనిఫెస్టోలు**

ఈ ఎన్నికల్లో అతివలే లక్ష్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించాయి. వారిని ఆకట్టుకునేలా మేనిఫెస్టోలలో హామీలను పొందుపరిచాయి. తాము మళ్లీ అధికారంలోకి వస్తే అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ.3 వేల జీవనభృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాల సమాఖ్యలన్నింటికి సొంత భవనాల నిర్మాణం వంటి హామీలను బీఆర్ఎస్ ప్రకటించింది. ఇక కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మొదటగా మహాలక్ష్మిని పేర్కొంది. ఈ పథకం కింద ప్రతి నెలా రూ. 2,500 ఇస్తామని ప్రకటించింది. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి ప్రకటించింది.

**మహిళలూ.. మీకు వందనం**

అధికార బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్, బీజేపీలు మహిళల ఓట్లను రాబట్టుకునే విషయంలో లెక్కలు వేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ఇప్పటికే మహిళల కోసం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్, ఒంటరి మహిళలకు పెన్షన్, గృహలక్ష్మి వంటి పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలతో మండలాలు, గ్రామాల వారీగా కరపత్రాలను ముద్రించి ప్రచారంలోకి దిగింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఆ దిశగా తమ ఆరు గ్యారంటీలతో ప్రచారం మొదలుపెట్టింది.



## న్యూస్‌రీల్

### రూ.66.5 లక్షల నగదు సీజ్

నల్లగొండ : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.66.5 లక్షల నగదును బుధవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా 1671.57 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశారు. ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారుల తనిఖీల్లో భారీగా డబ్బు, మద్యం పట్టుబడుతోందని అధికారులు పేర్కొన్నారు.

### నేటి నుంచి ఉచిత క్షయ నిర్ధారణ పరీక్షలు

నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉన్న లేబర్ అడ్డాలు, కాటన్, రైస్ మిల్లులు, మురికి వాడలు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాల్లో గురువారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఉచిత క్షయ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ కె.కళ్యాణ్ చక్రవర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సంచార బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఏఎమ్మార్పీ తూముల వద్ద హెచ్చరిక బోర్డులు



క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గుర్రంపోడు: ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వపై 47 కిలోమీటర్ వద్ద గల గేట్లను తాకొద్దని అధికారులు బుధవారం హెచ్చరిక ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు తక్కువ మోతాదులో నీటిని విడుదల చేస్తున్నందున తూములకు మళ్లించేందుకు కొందరు వ్యక్తులు క్రాస్ రెగ్యులేటర్ గేట్ల తాళ్లను కోసేశారు. దీంతో కాల్వ కట్ట తెగిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు క్రాస్ రెగ్యులేటర్ల వద్ద ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. గేట్లను ఎవరు తాకినా పోలీస్ కేసులు నమోదు చేస్తామని డివిజన్ ఈఈ ఆనందరావు, ఏఈ శ్రీనివాసరావు హెచ్చరించారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు బుధవారం నల్లగొండలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలోని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు ఇవ్వని కారణంగా గ్రామ పంచాయతీ కార్మికులు పండగపూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో దండెంపల్లి సత్తయ్య, ఇరిగి ఎల్లేష్, సురేష్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### యాదాద్రిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

## మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిక

- జీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీలోని అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిన రెండు మూడు రోజుల్లోనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో అధికార పార్టీకి గట్టి షాక్ తగిలినట్టు అయ్యింది. మొదట మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో పాటు ఐదుగురు కౌన్సిలర్లు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా బుధవారం మరో ఇద్దరు కౌన్సిలర్లు బోయినపల్లి శ్రీనివాస్, సమి కాంగ్రెస్‌లో చేరగా కోమటిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. మరో ముగ్గురు, నలుగురు కౌన్సిలర్లు కూడా పార్టీ మారడానికి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. నీలగిరి మున్సిపాలిటీలో ముందు కూడా వలసల పరంపర కొనసాగే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ఉన్నారు.



కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్, సమి, చిత్రంలో వైస్‌చైర్మన్ రమేష్‌గౌడ్

**నేడో, రేపో బీజేపీ నాయకులు!**

నల్లగొండ: నల్లగొండలో బీజేపీకి చెందిన దాదాపు పది మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో మాజీ కౌన్సిలర్లు, పోటీ చేసి ఓడిపోయిన నాయకులు, ఒకరిద్దరు కౌన్సిలర్లు కూడా ఉన్నట్టు సమాచారం. వీరంతా నేడో రేపో కాంగ్రెస్‌లోకి రానున్నట్టు తెలుస్తోంది. వీరు ఇప్పటికే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మంతనాలు జరిపినట్టు తెలిసింది.

## కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపాలు, సహస్ర నామార్చన, నవావరణ పూజ, కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మ సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

## నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

మునుగోడు: నిర్దేశిత పనులకు కాకుండా ఇతర పనులకు ఉపాధి హామీ పథకనిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ కాళిందిని హెచ్చరించారు. మునుగోడు మండలంలో 2021 ఫిబ్రవరి 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన రూ.12 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులపై బుధవారం మునుగోడు ఎంపీడీఓ కార్యాలయంలో 13వ సారి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మునుగోడు మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై వారం రోజులపాటు తనిఖీ చేసిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు నివేదికలను ఎన్నికల కోడ్ కారణంగా ఎంపీడీఓ కార్యాలయంలోనే జిల్లా అధికారుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కాళిందిని మాట్లాడుతూ పనులు జరిగిన ప్రదేశంలో ఒకటికి రెండుమార్లు కొలతలు తీసుకొని ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని సూచించారు. పనిచేసిన ప్రదేశంలో విధిగా ఆ పనికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఆర్‌డీఓ నవీన్‌కుమార్, నల్లగొండ ఏపీడీ ఉపేందర్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ గౌడ్, ఏపీఓ శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కాళిందిని

## ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి



చండూరులో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్



మునుగోడులో బీఎల్‌ఓకు సూచనలు చేస్తున్న కలెక్టర్

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

చండూరు, మునుగోడు: శాసనసభ ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. బుధవారం ఆయన చండూరులోని ఆర్‌ఓ, ఆర్‌డీఓ కార్యాలయాలోపాటు డాన్‌బాస్కో కళాశాలలో రిసెప్షన్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలు, మునుగోడులోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పరిశీలించారు. పలు విషయాల గురించి రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)తో చర్చించి పలు విషయాలను తెలుసుకొని సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20న మొదటి ర్యాండమైజేషన్ తర్వాత ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయిస్తామన్నారు. ప్రతిఒక్క ఓటరుకు సీ–విజిల్‌పై అవగాహన కల్పించాలని మునుగోడులో బీఎల్‌ఓలకు సూచించారు. ఓటర్లు సీ–విజిల్ యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడు చేయించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టే ఫొటోలు గాని వీడియోలు తీసి యాప్‌లో అప్‌లోడు చేస్తే 100 నిమిషాలల్లో అధికారులు విచారణ చేపడుతారన్నారు. ఆయన వెంట ఆర్‌ఓ దామోదర్‌రావు, చండూరు మున్సిపల్ కమిషనర్ కరణ్, తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, నరేందర్, డీటీ దీపక్, రఘుపతి, రమేష్ తదితరులు ఉన్నారు.

## సరిహద్దులో అప్రమత్తత అవసరం

- ఎస్పీ అపూర్వరావు


అడవిదేవులపల్లి: తెలంగాణ–ఏపీ రాష్ట్రాల సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ డబ్బు, మద్యం, ఆభరణాలు, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా కాకుండా చూడాలని ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. అడవిదేవులపల్లి:మండల కేంద్ర సమీపంలోని తెలంగాణ– ఏపీ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన టెయిల్‌పాండ్ చెక్‌పోస్టును బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట డీఎస్పీ వెంకటగిరి, సీఐ ముత్తినేని సత్యనారాయణ, ఎస్ఐ హరిబాబు తదితరులు ఉన్నారు.



టెయిల్‌పాండ్ చెక్ పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

## వేలిముద్ర తప్పనిసరి

- ధాన్యం అమ్మే రైతుల నుంచి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయం
- దళారులకు చెక్ పెట్టేలా కొత్త విధానం
- ఈ సీజన్ నుంచే అమలుకు శ్రీకారం
- పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నల్లగొండ: ధాన్యం కొనుగోళ్ల విషయంలో దళారులకు చెక్ పెట్టేందుకు ఈ సీజన్ నుంచే ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలనుకునే రైతులు సదరు కేంద్రంలో వేలిముద్ర వేయాలనే నిబంధన తెచ్చింది. ఇప్పటికే పత్తి అమ్మకానికి ఈ విధానాన్ని అమలు చేస్తుండగా తాజాగా ధాన్యం అమ్మకాలకు కూడా అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటుచేయనుంది. ప్రతి రైతు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ధాన్యం తూకం వేయగానే అక్కడ కేంద్రంలో వేలిముద్ర వేసేలా చర్యలు తీసుకోనుంది. అయితే కౌలు రైతుల విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

**దిగుబడి అంచనా 11.75 లక్షల మెట్రిక్ టన్నులు**

ఈ సారి వానాకాలం సీజన్‌లో జిల్లాలో 11.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అందులో దొడ్డు ధాన్యం 6.75 లక్షల మెట్రిక్ టన్నులు, సన్న ధాన్యం 5 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని లెక్కలు కట్టారు. అయితే సన్న ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తుండగా దొడ్డు ధాన్యం మాత్రం 5.50 లక్షల మెట్రిక్‌టన్నులు మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశారు. అందుకు సంబంధించి జిల్లాలో 213 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో అవసరమైన తూకం యంత్రాలతోపాటు టార్పాలిన్లు చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా శాఖ అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తయింది. అయితే 1.50 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా ప్రస్తుతం 60 లక్షల బ్యాగులు సిద్ధంగా ఉండగా.. మిల్లర్ల వద్ద 40 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి.

**క్లియర్ కాని ఓపీఎంఎస్..**

ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రైతు, ధాన్యం వివరాలను ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్)లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రతి సీజన్ పూర్తి కాగానే ఆ సైట్‌ను క్లోజ్ చేస్తారు. ప్రస్తుతం గత సీజన్‌కు సంబంధించిన సమాచారాన్ని మొత్తం క్లియర్ చేస్తే జిల్లా సిబ్బంది వద్ద ఉన్న ట్యాబ్‌లలో ఓపీఎంఎస్ ఓపెన్ అవుతుంది. దీంతో కొనుగోలు చేసిన వివరాలు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓపీఎంఎస్‌ను క్లియర్ చేసే కార్యక్రమం కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**20వ తేదీ నుంచి కొనుగోళ్లు..**

ఈ నెల 20వ తేదీ నుంచి వానాకాలం ధాన్యం కొనుకోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముందస్తుగా నాట్లు వేసిన రైతులు తమ పొలాలు కోసి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ నిర్ణయించారు. దీంతో బుధవారం పలుచోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో శుక్రవారం నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

### దళారులను నమ్మి మోసపోవద్దు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కట్టంగూర్: రైతులు ప్రస్తుత సీజన్‌లో దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్ద జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కట్టంగూర్ మండలం అయిటిపాములలో ఐకేపీ, కట్టంగూర్‌లో పీఏసీఎస్, నల్లగొండ మండలం ఆర్జాలబావి, ఖాజీరామారం, చందనపల్లి, రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఓ కాళిందిని, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రేడ్–ఏ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర నిర్ణయించందని తెలిపారు. వసతులు కల్పించాలని, లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమాల్లో డీసీఓ కిరణ్‌కుమార్, డీఎం నాగేశ్వర్‌రావు, కట్టంగూర్ ఎంపీడీఓ పోరెళ్ల సునిత, ఏపీడీ సరస్వతి, డీపీఎం రామలింగయ్య, సివిల్ సప్లయ్ డీటీ జ్యోతి, సీఈఓ మల్లారెడ్డి, వెలుగు ఏపీఎంలు చెవుగోని వినోద, సైదులు, సీసీలు కారింగు శంకర్, నర్సింహ, స్వాతి, చంద్రయ్య, అనంతరెడ్డి పాల్గొన్నారు.



కట్టంగూర్: అయిటిపాములలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

## యుద్ధభేరి సభను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నవంబర్ 5న నిర్వహించనున్న మాదిగల యుద్ధభేరి సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కత్తుల తులసీదాస్, జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్‌మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో యుద్ధభేరి సభ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బరిగెల యాదయ్య, బచ్చలకూర లింగయ్య, బొస్క శ్రీను, వంగూరు రాజు, కొండ మహేష్, ఇద్దయ్య, రమేష్, నాగరాజు, శ్రవణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికల 'చిత్రాలు'


నల్లగొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


చిట్యాలలో ఓటు అభ్యర్థిస్తున్న బీఎస్పీ అభ్యర్థి ప్రియదర్శిని


అనంతగిరి : గోండ్రియాలలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి


దామరచర్లలో ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు తిలకందిద్దుతున్న మహిళ


భూదాన్ పోచంపల్లిలో వృద్ధురాలితో కలిసి నృత్యం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

జంగ్ తెలంగాణ

# మిర్యాలగూడలో విలక్షణ తీర్పు






## ఎక్కువసార్లు కాంగ్రెస్, కమ్యూనిస్టులకే పట్టం

- హ్యాట్రిక్ కొట్టిన తిప్పన చినకృష్ణారెడ్డి
- ఆసియా ఖండంలో అత్యధిక రైస్ మిల్లులు ఉన్న ప్రాంతం ఇదే..

అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

**మిర్యాలగూడ :** ఆసియా ఖండంలోనే అత్యధిక రైస్ మిల్లుల ఉన్న ప్రాంతంగా పేరు గాంచింది మిర్యాలగూడ. ఈ ప్రాంతం తెలంగాణ బియ్యపు పాత్ర (రైజ్ బౌల్)గా వెలుగొందుతోంది. కృష్ణా, మూసీ నదుల సంగమం ఇక్కడే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఈ నియోజకవర్గంలోనే నిర్మితమవుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందింది. ఇక్కడి ఓటర్లు కాంగ్రెస్, కమ్యూనిస్టులకే ఎక్కువసార్లు పట్టం కట్టారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 14 సార్లు ఎన్నికలు జరిగితే ఏడు సార్లు కాంగ్రెస్, ఐదు సార్లు సీపీఎం, ఒక సారి పీడీఎఫ్, ఒక సారి టీఆర్ఎస్ గెలిచాయి. రైస్ ఇండస్ట్రీలు ఎక్కువగా ఉండడం, అందులో పనిచేసే కార్మికులు, సాగర్ ఆయకట్టు రైతులు, రైతు కూలీలు అధికంగా ఎక్కువగా కమ్యూనిస్టుల అండగా నిలిచారు.


చినకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, విజయసింహారెడ్డి


రంగారెడ్డి భాస్కర్‌రావు

**ఎమ్మెల్యేలైన తండ్రీకొడుకులు..**

మిర్యాలగూడ నియోజకవర్గంలో తండ్రీకొడుకులు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. 1962, 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున తిప్పన చిన కృష్ణారెడ్డి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. 1989లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన ఆయన కుమారుడు తిప్పన విజయ సింహారెడ్డి గెలిచారు.

**ఇప్పటివరకు మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వీరే..**

| సంవత్సరం | ఎమ్మెల్యే | పార్టీ | ప్రత్యర్థి | పార్టీ |
|---|---|---|---|---|
| 1957 | సి.వెంకట్‌రెడ్డి | పీడీఎఫ్ | డి.నర్సింహారెడ్డి | ఐఎన్‌సీ |
| 1962 | తిప్పన చినకృష్ణారెడ్డి | కాంగ్రెస్ | చల్లా సీతారాంరెడ్డి | సీపీఎం |
| 1967 | తిప్పన చినకృష్ణారెడ్డి | కాంగ్రెస్ | చల్లా సీతారాంరెడ్డి | సీపీఎం |
| 1972 | తిప్పన చినకృష్ణారెడ్డి | కాంగ్రెస్ | ఎంఎస్.రామయ్య | సీపీఎం |
| 1978 | అరిబండి లక్ష్మీనారాయణ | సీపీఎం | టి.లింగయ్య | కాంగ్రెస్ |
| 1983 | చకిలం శ్రీనివాస్‌రావు | కాంగ్రెస్ | అరిబండి లక్ష్మీనారాయణ | సీపీఎం |
| 1985 | అరిబండి లక్ష్మీనారాయణ | సీపీఎం | చలీనమ్మ | కాంగ్రెస్ |
| 1989 | తిప్పన విజయసింహారెడ్డి | కాంగ్రెస్ | అరిబండి లక్ష్మీనారాయణ | సీపీఎం |
| 1994 | జూలకంటి రంగారెడ్డి | సీపీఎం | తిప్పన విజయసింహారెడ్డి | కాంగ్రెస్ |
| 1999 | రేపాల శ్రీనివాస్ | కాంగ్రెస్ | సుందరి అరుణ | టీడీపీ |
| 2004 | జూలకంటి రంగారెడ్డి | సీపీఎం | పొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి | టీడీపీ |
| 2009 | జూలకంటి రంగారెడ్డి | సీపీఎం | తిరునగరు గంగాధర్ | కాంగ్రెస్ |
| 2014 | నల్లమోతు భాస్కర్‌రావు | కాంగ్రెస్ | అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి | టీఆర్ఎస్ |
| 2018 | నల్లమోతు భాస్కర్‌రావు | టీఆర్ఎస్ | ఆర్.కృష్ణయ్య | కాంగ్రెస్ |



● పీపుల్స్ ఎజెండా

# మా బతుకులు మార్చాలి

- సర్కార్ స్పందిస్తేనే మా రాత మారుతుంది
- రోజూ పనిదొరుకుతుందన్న గ్యారంటీ లేదు
- పనిలేకుంటే.. పస్తులుంటున్నాం
- లేబర్ బంధు ప్రకటించి ఆదుకోవాలి
- ప్రతి కార్మికునికి లేబర్ కార్డు ఇవ్వాలి
- ప్రమాద బీమాను రూ.10లక్షలకు పెంచాలి

'అడ్డా' సాక్షిగా.. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్



ఆవుల లక్ష్మయ్య, వంగాల శ్రీనివాస్‌రెడ్డి

**ఆ రోజు వారు పని చేస్తేనే.. ఆ కుటుంబం ఆకలి తీరుతుంది. లేదంటే పస్తులే. ఉదయాన్నే సద్ది కట్టుకుని పని కోసం అడ్డా మీదికి వెళ్తే అక్కడ గంటల కొద్దీ నిరీక్షణ. ఎండయినా.. వానయినా అలా రోడ్డుపైన.. దుకాణాల ఎదుట నిలబడాల్సిందే. పని దొరికినా వచ్చే కూలి అరకొరే. ఆ డబ్బుతో పూటగడవక దుర్భర జీవితాలు గడుపుతున్నారు అడ్డా కూలీలు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకుల్లో వెలుగు రావడం లేదని అంటున్నారు. ప్రస్తుతం శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ పట్టణంలోని భాస్కర్ టాకీస్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులను 'సాక్షి' పలకరించగా.. వారి సమస్యలను ఏకరువు పెట్టారు.**


నల్లగొండలోని భాస్కర్ టాకీస్ అడ్డా వద్ద పని కోసం వేచి ఉన్న కార్మికులు

దళితబంధు, బీసీ బంధు మాదిరిగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌బంధు ప్రకటించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని భవన నిర్మాణ కార్మికులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. పనిచేస్తేనే పూడగడిసే పరిస్థితుల్లో కార్మికులకు చేతినిండా పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అడ్డాల వద్ద కూలీల కోసం షెడ్డు నిర్మాణం, మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు. కార్మికుల పిల్లల చదువు కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఇచ్చే ఆర్థిక సాయం రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి సంక్షేమ బోర్డు ద్వారా ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నెలలో 10 నుంచి 15 రోజులు మాత్రమే పనిదొరుతుందని పనిదొరకని రోజుల్లో పూట గడవడం కష్టతరంగా మారుతున్నందున పూర్తిస్థాయిలో ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల అభిప్రాయాలు ఇలా..

### ప్రమాద బీమా పెంచాలి



భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. అనేక మంది కార్మికులు పనిచేసే సమయంలో కింద పడి మరణిస్తున్నారు. దాంతో వారి కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తోంది.

– జంజిరాల జానయ్య, ముషంపల్లి

### లేబర్‌బంధు ఇవ్వాలి



25 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నా. కొన్ని సార్లు పని దొరకక ఇబ్బందులు పడుతున్నా. నిరంతరం అష్టకష్టాలు పడుతున్న భవన నిర్మాణ కార్మికులకు దళితబంధు మాదిరిగా లేబర్‌బంధు ఇచ్చే విధంగా అన్ని రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వాలి.

– సత్తయ్య, నల్లగొండ

### బ్యాంకు రుణాలు ఇప్పించాలి



భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మాకు నెల రోజులు పనిదొరకక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నాం. సంక్షేమ బోర్డునుంచి రుణం ఇప్పిస్తే సెంట్రింగ్ సామగ్రిని ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందుతా.

– నల్ల శ్రీకాంత్, చందుపట్ల

### డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్ ఇళ్లు ఇవ్వాలి. ఇందుకోసం ప్రత్యేక కోటా కేటాయించాలి. ఇళ్లు లేక అనేక మంది కార్మికులు అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కోటా అమలు చేసి ఆదుకోవాలి.

– కల్లెట్ల వెంకన్న, బీటీఎస్, నల్లగొండ

### యాభై ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలి



భవన నిర్మాణ కార్మికులకు యాభై సంవత్సరాలు వచ్చే సరికి పనిచేయడానికి ఆరోగ్యం సహకరించదు. బరువుతో కూడిన పని అయినందున వయస్సు మీద పడితే పని చేయలేకపోతున్నాం. యాభై ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.5 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలి.

– కొంపెల్లి యాదమ్మ, ఊటుక్కూరు

### ప్రతి కార్మికుడికి లేబర్ కార్డు ఇవ్వాలి



కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులందరికి లేబర్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలి. కార్డు ద్వారా సబ్సిడీ రుణాలను ఇప్పించాలి.

– సాగర్ల మల్లయ్య, పానగల్

### ఇంటి స్థలం ఇవ్వాలి



ఊర్లో పని దొరకక కుటుంబ పోషణ కోసం పట్టణానికి పనికోసం వచ్చా. ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంటున్నాం. రోజూ పని దొరక్కపోవడంతో పాటు రోజు వారి ఖర్చులు పెరిగి ఇంటి అద్దె కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలి.

– మెగావత్ చిట్టమ్మ, జానూతులతండా

### హెల్త్ కార్డులను ఇప్పించాలి



భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు నిత్యం ఏదో ఒక ప్రమాదం బారిన పడుతుంటారు. ఆ సమయంలో వైద్యం చేయించుకునే స్థోమత లేనివారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతి కార్మికుడికి రూ.20 లక్షల విలువ చేసే హెల్త్ కార్డులు అందించి ఆదుకోవాలి.

– ఆలకుంట్ల విజయ, వెలుగుపల్లి

## పార్వతీరామలింగేశ్వర ఆలయంలో చోరీ


చోరీ జరిగిన గదిని పరిశీలిస్తున్న అర్చకుడు

**మద్దిరాల:** మండల కేంద్రంలోని పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలోకి చొరబడి రూ.2లక్షల విలువైన పురాతన వస్తువులను అపహరించారు. బుధవారం తెల్ల వారుజామున ఆలయంలోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ అర్చకుడు ప్రసాద్‌శర్మ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏ. రవీందర్ తెలిపారు.



## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**చందంపేట:** భార్య కాపురానికి రావడం లేదని పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ ఘటన చందంపేట మండలం పోలేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటిగానితండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటిగానితండాకు చెందిన సపావత్ చీన్య(35)కు 13ఏళ్ల క్రితం పోల్యానాయక్‌తండాకు చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సునీత తన తల్లిగారింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన చీన్య మంగళవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా బుధవారం మృతిచెందాడు.

### జీవితంపై విరక్తితో..

**రామగిరి(నల్లగొండ):** జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన బత్తుల భద్రయ్య(75) 5 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. జీవితం మీద విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు బత్తుల సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఉరేసుకొని ఆత్మహత్య

**పెన్‌పహాడ్:** పెళ్లి కాలేదని జీవితంపై విరక్తితో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలంలోని లింగాల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల గ్రామానికి చెందిన తడకమళ్ల మధుకుమార్(53)కు పెళ్లి కాకపోవడంతో తన ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తన చావుకు ఎవరూ కారణం కాదని, జీవితంపై విరక్తితో చనిపోతున్నానని మృతుడు రాసిన సూసైడ్ నోట్ లభించినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడి సోదరుడు యాదగిరి లక్ష్మీనరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణం

**సూర్యాపేట రూరల్:** ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని కేటీ అన్నారం రోడ్డులో గల జాహ్నవి టౌన్‌షిప్ వద్ద బుధవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాల కోసం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## 130 కిలోల వెండి వస్తువులు స్వాధీనం

**సూర్యాపేట క్రైం:** సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ వ్యాపారి ఇంట్లో 130 కిలోల వెండి వస్తువులను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సూర్యాపేట పట్టణంలోని పూలసెంటర్‌లో పట్టణానికి చెందిన ఉత్తమ్ డోర్ కర్టన్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతడి ఇంట్లో భారీగా వెండి వస్తువులు నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం పట్టణ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా.. వెండితో తయారుచేసిన కుంకుమ భరిణలు, గ్లాసులు, ప్లేట్లు, మెడలో వేసుకునే చైన్లు, బ్రాస్‌లెట్స్ లభ్యమయ్యాయి. దీంతో పోలీసులు ఆ వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వెండి వస్తువులకు సంబంధించి ఎలాంటి బిల్లులు కూడా వ్యాపారి వద్ద లేవని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.


సూర్యాపేట క్రైం: పట్టుబడిన దుస్తులు, సూట్‌కేసులను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

### రూ.31లక్షల విలువైన దుస్తులు సీజ్..

**కోదాడరూరల్ :** ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, పరిగి, వనపర్తి ప్రాంతాలకు దుస్తులు తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేశారు. అందులోని రూ.31లక్షల విలువైన దుస్తులతో పాటు దుస్తులు కొనుగోలు చేస్తే ఆఫర్ కింద ఇచ్చేందుకు సూట్‌కేసులు కూడా తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. కాగా దుస్తులు, సూట్‌కేసులకు తరలింపునకు సంబంధించి సరైన ఆధారాలు చూపని కారణంగా వాటిని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

### మోతె మండలంలో 110 పట్టుచీరలు..

**మోతె:** మండలంలోని మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఓ కారులో 110 పట్టుచీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన బట్టల వ్యాపారి స్కందం వెంకటేశ్వర్లు ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు కారులో రూ.5లక్షల విలువ గల 110 పట్టుచీరలను తీసుకెళ్తుండగా.. సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు మోతె ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### చింతపల్లిలో రూ.3.70లక్షలు..

**చింతపల్లి:** మండల కేంద్రంలో హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు రూ.3.70లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన మాల్యాద్రి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.3.70లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

## మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం


సునంద

**హుజూర్‌నగర్:** మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని చైతన్య కాలనీకి చెందిన లింగనబోయిన సునంద తన భర్తతో విడాకులు తీసుకొని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె మతిస్థిమితం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు పలు హాస్పిటల్స్‌లో చికిత్స చేయించి ఇంటి వద్దనే ఉంచుకుంటున్నారు. కాగా ఈ నెల 16వ తేదీన ఉదయం సునంద ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అన్న లింగనబోయిన శ్రావణకుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయాలు

**హుజూర్‌నగర్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం రాత్రి హుజూర్‌నగర్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడేనికి చెందిన మస్తాన్ బుధవార రాత్రి హుజూర్‌నగర్ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దద్దనాల చెరువు కాలనీ సమీపంలోకి రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి హుజూర్‌నగర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అక్కడి డాక్టర్లు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్య కోసం సూర్యాపేట తరలించారు.

## రైతులకు ఇచ్చే హామీలను వెంటనే ప్రకటించాలి

**హుజూర్‌నగర్‌రూరల్:** రైతుల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు ఏం చేస్తారో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సీతారాంపురంలో నిర్వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల రక్షణ కోసం ఏ ఒక్క పార్టీ కూడా ఎన్నికల ప్రణాళికలో హామీ ఇవ్వలేదని ఆరోపించారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదం మరోసారి జోరు అందుకుందని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే రాజకీయ పార్టీల నాయకులను 'రైతుల పక్షాన నిలబడి వ్యవసాయాన్ని కాపాడండి, రైతును రక్షించాలి'అనే నినాదంతో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి డేవిడ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నేటికీ అమలు చేయకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు, నాయకులు నాగయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, సరోజన, లక్ష్మి, రామలింగమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

# బంక్‌ల మూసివేతతో అవస్థలు

- కనగల్‌లో మూతబడిన రెండు పెట్రోల్ బంక్‌లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- బ్లాక్‌లో పెట్రోల్, డీజిల్ అమ్మకం

**కనగల్ :** మండల కేంద్రంలో ఉన్న రెండు పెట్రోల్ బంక్‌లు మూసి ఉండడంతో వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఎస్సార్ బంక్ గతంలోనే మూసివేయగా.. హెచ్‌పీ పెట్రోల్ బంక్ పది రోజులుగా మూసివేశారు. దీంతో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తూ నానా తంటాలు పడుతున్నారు. దూరం ప్రాంతాలకు వెళ్లలేనివారు గ్రామంలోనే రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా చెల్లించి బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు.

**దర్వేశిపురం బంక్ వద్ద వాహనదారుల క్యూ**

కనగల్ మండల కేంద్రంతోపాటు బుడుమర్లపల్లి, పర్వతగిరి, బోయినపల్లి, దోరెపల్లి గ్రామాల నుంచి నిత్యం 500 ట్రాక్టర్ల ద్వారా నల్లగొండ పట్టణానికి ఇసుక తరలిస్తుంటారు. కనగల్ మండల కేంద్రలో రెండు పెట్రోల్ బంక్‌లు మూసివేయడంతో దర్వేశిపురం బంక్ వద్దకు డీజిల్ కోసం క్యూ కడుతున్నారు. దీంతో నల్లగొండ-దేవరకొండ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది.

**వరికోత మిషన్ యజమానుల తిప్పలు..**

కనగల్ మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్‌లు మూసి ఉండడంతో వరికోత మిషన్ యజమానులు దూర ప్రాంతాలకు వెళ్లి డీజిల్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనగల్‌లో డీజిల్ అందుబాటులో లేకపోవడంతో సకాలంలో వరికోతలు ప్రారంభించలేక పోతున్నామని వారు పేర్కొంటున్నారు.

**బంక్ ముందే బ్లాక్ దందా..**

కనగల్‌లో పెట్రోల్ బంక్ మూసి ఉండడంతో బంక్ ముందే వ్యాపారులు పెట్రోల్, డీజిల్ బ్లాక్‌లో అమ్ముతున్నారు. లీటర్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తూ బ్లాక్ దందా జోరుగా కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలోనే పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక పోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంక్‌లను ఎందుకు మూసివేయాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. బంక్‌ను తెరిపించాలని ఇప్పటికే తహసీల్దార్‌కు పలువురు వాహనదారులు ఫిర్యాదు కూడా చేశారు.



బంక్ ఎదుట పెట్రోల్, డీజిల్‌ను బ్లాక్‌లో అమ్ముతున్న వ్యాపారులు

**అదనంగా డబ్బులు చెల్లిస్తున్నాం**



మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్‌లు పది రోజుల నుంచి మూసి ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ కోసం నల్లగొండ, దర్వేశిపురంకు వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా పెట్రోల్, డీజిల్‌ను కొనాలంటే లీటర్‌పై అదనంగా రూ.30 ఇవ్వాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు పట్టించుకుని త్వరితగతిన బంక్‌లు తెరిచే విధంగా చూడాలి.

–సిరిషాల కిషన్, కనగల్ గ్రామస్తుడు

**రెండు రోజుల్లో అందుబాటులోకి తెస్తాం**

స్టాక్ విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. మరో రెండు రోజుల్లో బంక్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం. వాహనదారులు సహకరించాలి.

–మేకల కిశోర్, హెచ్‌పీ బంక్ యజమాని

## క్లుప్తంగా

### కిశోర్‌కుమార్‌కు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కిశోర్‌కుమార్

**నల్లగొండ టౌన్ :** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్‌కు పుడమి సాహితీ వేదిక సంఘమిత్ర జాతీయ పురస్కారం అందజేసింది. మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణంలో భాగంగా కళా, విద్యా, వైద్య రంగాల్లో విశేష కృషి చేసినందుకు వేదిక ఈ అవార్డును ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కిశోర్‌కుమార్‌కు వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, డాక్టర్ అద్దంకి రాజాయోనా, ప్రిన్సిపాల్ కమిషన్ ఆఫ్ కస్టమ్స్ ఎస్‌కె రహమాన్, డి.నాగేశ్వర్‌రావు, డి.రాజేశ్వర్‌రావు, డాక్టర్ బెన్‌హర్ మద్దిరాల, శేషాసాయి అవార్డు అందజేసి సత్కరించారు.

### ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరినవారితో ఎంపీ కోమటిరెడ్డి

**శాలిగౌరారం :** మండలంలోని వల్లాల, అడ్లూరు గ్రామాలకు చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో వల్లాల ఉప సర్పంచ్ గుండ్లపల్లి సైదులు, వార్డు సభ్యులు కొంపల్లి జానయ్య, జాల మహేశ్, ఎల్లంల రమేశ్, అడ్లూరు గ్రామానికి చెందిన చిత్తలూరి వెంకన్న తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వల్లాల సర్పంచ్ షేక్ ఇంతియాజ్, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్, మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, వడ్లకొండ పరమేశ్, పెరుమాండ్ల నరేశ్, పన్నాల సత్తిరెడ్డి, కృష్ణ, దామోదర్, దానయ్య, శ్రవణ్, శంకర్, హన్మంతు, యాదయ్య, వెంకన్న, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాలి



రోడ్డు షోలో మాట్లాడుతున్న వెంకటస్వామి

**నకిరేకల్ :** ప్రజలకు ఏమీ చేయని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) అభ్యర్థి నూనె వెంకటస్వామి కోరారు. బుధవారం నకిరేకల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్, జలంధర్, కాడయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### బీఎస్పీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

**చిట్యాల :** నకిరేకల్ నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మేడి ప్రియదర్శిని బుధవారం చిట్యాల పట్టణంలోని శ్రీకనదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పట్టణంలోని వీధుల్లో ప్రచారం నిర్వహించి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు జోగు శేఖర్, మునుగోటి సత్తయ్య, అవిరెండి ప్రశాంత్, యోగి, మహేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

### పనుల నాణ్యత పరిశీలన

**మర్రిగూడ :** మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి వేసిన సీసీ రోడ్డు పనుల నాణ్యతను బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈ నర్సింహారావు పరిశీలించారు. పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారులకు నివేదిక పంపించనున్నట్లు డీఈ తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఏఈ మహమూద్, సిబ్బంది ఉన్నారు.

### నిందితుడికి జరిమానా

**మిర్యాలగూడ టౌన్ :** పోలీస్ కస్టడి నుంచి తప్పించుకున్న నిందితుడికి రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం మిర్యాలగూడ ఒకటో అదనపు న్యాయమూర్తి బీఎస్ఎన్ సుమబాల తీర్పునిచ్చారు. వివరాలు... దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పుట్టలగడ్డకు చెందిన ఆగోంతు హాతిరాం మిర్యాలగూడ కోర్టులో విధులను నిర్వర్తిస్తున్న వాడపల్లి పోలీసు స్టేషన్‌కోర్టు కానిస్టేబుల్ కస్టడి నుంచి తప్పించుకున్నాడు. కానిస్టేబుల్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ భిక్షపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జీ షీట్‌ను కోర్టులో దాఖల్ చేశాడు. నిందితుడు హా తిరాంపై నేరం రుజువు కావడంతో రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## ఆర్థికసాయం అందజేత

**కనగల్ :** పగిడిమర్రి గ్రామానికి చెందిన నీలకంఠం రాములు, దోరెపల్లి గ్రామానికి చెందిన దాసరి చంద్రమ్మ, చర్లగౌరారం గ్రామానికి చెందిన మనుపాటి సత్తయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. రాములు, చంద్రయ్య కుటుంబాలకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.10 వేల చొప్పున, సత్తయ్య కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ద్వారా బుధవారం అందజేశారు. అదేవిధంగా సత్తయ్య కుటుంబానికి చర్లగౌరారం సర్పంచ్ చింతల యాదగిరి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ తదితరులున్నారు.

**కోమటిరెడ్డి సాయం**

దోరెపల్లి గ్రామానికి చెందిన దాసరి చంద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం రూ.20 వేల నగదును స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బైరగోని శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, జలేందర్, అయితగోని శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

## నేటి నుంచి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**శాలిగౌరారం :** శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద తిరుమలరాయునిగూడెం గ్రామానికి చెందిన చాడ కిషన్‌రెడ్డి ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు శేషభట్టర్ నర్సింహాచార్యులు, రత్నమాచార్యులు, రామచంద్రాచార్యులు, జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈనెల 19న దేవతారాధన, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధన దీక్షాస్వీకరణ, అంకురార్పన, అగ్నిప్రతిష్ఠ, వాస్తుపూజ, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం ధాన్యాదివాసం, శయ్యాధివాసం, ఛాయాధివాసం, హారతి ఆరగింపు, 20న ఆరాధన, అధివాసములు, యంత్ర ప్రతిష్ఠ, మూర్తిప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, మూర్తికుంబాభిషేకం, అలంకరణ, శాంతికల్యాణం, ఆరగింపుహారతి, రుత్విక్‌సన్మానం ఆశీర్వచనం, విష్ణుసహస్ర, హనుమత్ అష్టోత్తర పారాయణాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

# రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

**నల్లగొండ రూరల్ :** ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం దోనకల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తండు సత్తయ్య, పెంటయ్య, పాలకూరి స్వామి, యాదయ్య, అంజయ్య, భీమార్జున్‌రెడ్డి, స్వామిరెడ్డి, వెంకన్న, భిక్షమయ్య, జాన్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

**రామగిరి(నల్లగొండ) :** తిప్పర్తి మండంలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన సుమారు 20 మంది బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, బద్దం సుధీర్, నాగేశ్వరరావు, కె.సైదులు, ఎం.రవీందర్, ఎం.సతీష్, ఎం.నరేందర్, అరుణ్, వెంకటేశ్, శ్రీను, మనోజ్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



నకిరేకల్ : కరపత్రాలను పంపిణీ చేస్తున్న గాజుల సుకన్య , తదితరులు



గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నకిరేకల్ :** నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల సుకన్య బుధవారం నకిరేకల్ శివారులోని బాబాసాహెబ్‌గూడెంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ స్కీంల ప్రచార కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వంటిపాక యేసు రత్నం, నకిరేకల్ మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ అంజమ్మ, సిరుగు జ్యోతి, బండగొర్ల జ్యోతి, దికొండ ధనమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం**

**చండూరు(గట్టుప్పల్) :** మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు బుధవారం గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భీమగాని మల్లేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెరుపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పంకెర్ల ఐలయ్య, పగిళ్ల నరసింహ నాగులగాని శ్రీనివాస్, వీరయ్య, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాములు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తిప్పర్తి మండలం అంతాయిగూడెం ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

**రామగిరి(నల్లగొండ), నకిరేకల్ :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం తిప్పర్తి మండలం అంతాయిగూడెం, తానేదార్‌పల్లి, పజ్జూరులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, నకిరేకల్ మండలం తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చీమలగడ్డలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలోనే మొదటిగా మన జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈ నెల 20 నుంచి జిల్లావ్యాప్తంగా ధాన్యం కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేస్తామన్నారు. తాలు, మట్టిపెడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. అన్ని కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉంచామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే దగ్గరలోని మిల్లులకు తరలించాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వరరావు, డీపీఎం రామలింగయ్య, ఏపీడీ సరస్వతి, ఏపీఎం శ్రీదేవి, డీటీఎస్ జ్యోతి, తాటికల్ పీఏసీఎస్ సీఈఓ జగన్‌రెడ్డి, సిబ్బంది సైదులు తదితరులు పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లి :** మండలంలోని జువిగూడెం గ్రామంలో బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం మైసేశ్వర్‌రావు, ఎంపీఓ గిరిప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు అండాలు, జ్యోతి, ముని, రమాదేవి, ఏఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వీఓఏ పద్మ, రైతులు తదితరులున్నారు.

**కనగల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. బుధవారం కనగల్ మండల పరిధిలోని ఏమిరెడ్డిగూడెం, పగిడిమర్రి, కురంపల్లి, రాంచంద్రాపురం, మదనాపురం, శేరిలింగోటం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీరియల్ పాటించి ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బత్తుల నరహరి, సీసీలు విజయలక్ష్మీ, వసంత, ప్రభాకర్ ఐకేపీ నిర్వాహకులు రజిత, పద్మ, దశరథరెడ్డి, ధనమ్మ, శివలక్ష్మీ, సైదమ్మ, సువర్ణ తదితరులున్నారు.

**కేతేపల్లి :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేతేపల్లి తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఐకేపీ ఆధ్వర్యంలో కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం 17 కంటే తక్కువ ఉంటేనే మద్దతు ధర అందుతుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, ఏఓ బి.పురుషోత్తం, ఏపీఎం బి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి



కనగల్ : ఏమిరెడ్డిగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్యోతి

## రేపటి నుంచి క్రికెట్ పోటీలు

**కట్టంగూర్ :** మండలంలోని ఎరసానిగూడెం గ్రామంలో మదర్ థెరిస్సా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జీవన జ్యోతి విత్తన శుద్ధి కర్మాగారం ప్రాంగణంలో ఈ నెల 20 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక డైరెక్టర్ ఫాదర్ జూలియన్ బుధవారం తెలిపారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు గురువారం సాయంత్రం లోపు ఎంట్రీ ఫీజు రూ.1500 చెల్లించాలని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 8935139284 సెల్ నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం

**కనగల్ :** మండల పరిధిలోని జి యడవల్లి గ్రామానికి చెందిన యువకులు కాడింగు చంటి, నకిరేకంటి సైదులు, కోరె నాగమణి, నీలకంఠం సతీష్‌లు ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. వారిని యడవల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫౌండర్ కొర్వి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పర్సనబోయిన రామకృష్ణ, జంగాల సురేష్, యూత్ గౌరవ అధ్యక్షుడు దోటి సైదులు, కొర్వి లింగస్వామి, కందుల లక్ష్మయ్య, రొయ్య వెంకన్న, యూత్ కమిటీ కో ఆర్డినేటర్ వాకిటి యాదగిరి, ఉపాధ్యక్షులు ఏర్పుల స్వాతిరామ్, సోషల్ మీడియా కన్వీనర్ భోగరాజు శ్రీను, కార్యదర్శి బొమ్మకంటి లింగస్వామి సభ్యులు పోలె అనిల్, తలారి గోపి, కొప్పుల సందీప్, రొయ్య యాదగిరి, పురం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆనంద్

**కట్టంగూర్ :** యువజన కాంగ్రెస్ కట్టంగూర్ మండల అధ్యక్షుడిగా పామనగుండ్ల గ్రామానికి చెందిన బండారు ఆనంద్, కట్టంగూర్ పట్టణ అధ్యక్షుడిగా కాపుగంటి నరేష్ నియమితులయ్యారు. బుధవారం వారికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నియామకపత్రం అందజేశారు.

# ప్రజలు కోరుకున్న మార్పు చేసి చూపించా

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

**నల్లగొండ టూటౌన్ :** గత అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కోసం తనను గెలిపించారని, ప్రజలు కోరుకున్న మార్పు నల్లగొండ పట్టణంలో చేసి చూపించానని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే తనను ఆశీర్వదించి మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మరోమారు అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.3 వేల భృతి, రైతుబంధు రూ.12 వేల నుంచి 16 వేల వరకు, ఆసరా పింఛన్లు రూ.3016 నుంచి రూ. 5016 వరకు, దివ్యాంగుల పింఛన్ రూ 4016 నుంచి రూ. 6016 వరకు పెంచుతామని అన్నారు. నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ మాదిరిగా నల్లగొండను అభివృద్ధి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సందినేని జనార్దన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, కటికం సత్తయ్యగౌడ్, మాలె శరణ్యారెడ్డి, కొండూరు సత్యనారాయణ, నాంపల్లి శ్రీనివాస్, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య

**కేతేపల్లి :** బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేయ పథకాలతో పాటు పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ కోరారు. బుధవారం కేతేపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించాలని సూచించారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, మహిళా అధ్యక్షురాలు మాందాసు విజయరాణి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, పలు గ్రామాల సర్పంచులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నకిరేకల్ :** బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సూచించారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ సభ్యులు ప్రతి గడపకు వెళ్లి సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, వైఎస్ ఎంపీపీ గోర్ల వీరయ్యసరిత, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, నాయకులు సోమ యాదగిరి. పెండెం సదానందం, సిలివేరు ప్రభాకర్, నోముల కేశవరాజు, వీర్లపాటి రమేష్, తక్కళ్లపల్లి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు**

నకిరేకల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మురారిశెట్టి కృష్ణమూర్తి, పెండెం సదానందం, నూకల రఘునందన్‌రెడ్డి, నారి రాంచంద్రయ్య, యల్లపురెడ్డి సైదిరెడ్డి, చొగోని లక్ష్మీనారాయణ, రాచకొండ వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

- కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ అభ్యర్థి వేముల వీరేశం



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేముల వీరేశం

**కేతేపల్లి :** పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని భీమారం, కొండకిందిగూడెం గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు వీరేశం సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపించినట్లయితే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కూరెళ్ళ లింగయ్య, రామబ్రహ్మం, నారాయణ, కూరెళ్ల వెంకటనర్సయ్య, కళ్లు సుదర్శన్‌రెడ్డి, గోలి ధర్మారెడ్డి, దోనాల వేణురెడ్డి, కోట్ల కళమ్మ, కోట్ల సైదులు, బండారు లక్ష్మి, బండారు వేణు తదితరులు ఉన్నారు.

# అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు

**చిట్యాల :** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్యాల పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో అమ్మవారు బుధవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

**లక్ష కుంకుమార్చన**

**రామగిరి(నల్లగొండ):** దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మిగా అలంకరించబడిన అమ్మవారి ఎదుట మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**చండూరులో..**

**చండూరు :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రావిరాల నగేష్, ట్రస్ట్ అధ్యక్షుడు కోమటి వీరేశం, అన్నదాత కర్నాటి రాఘవేంద్ర, ఉమారాణి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కనగల్ : మహాలక్ష్మీమాతగా దర్శనమిస్తున్న దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారు



చండూరు : కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



నల్లగొండ పట్టణంలోని తులసీ నగర్‌లో కుంకుమార్చన చేస్తున్న భక్తులు



చిట్యాల : కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

# కాలిపోయిన విద్యుత్ మీటర్‌కు ఆర్నెళ్లుగా బిల్లు

**రామగిరి(నల్లగొండ):** విద్యుత్ అధికారులు అడ్డగోలుగా కరెంటు బిల్లులు వేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తిప్పర్తి మండలంలోని ఎర్రగడ్డలగూడెం సర్పంచ్ ఎల్లంల శైలజాసతీష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సర్పంచ్ విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలో రెండు మోటార్లకు రెండు వేర్వేరు మీటర్లు ఉన్నాయని, ఆరు నెలల క్రితం రెండు మోటార్ల మీటర్లు కాలిపోయినా బిల్లులు వస్తున్నాయని తెలిపారు. ఎంపీడీఓ, విద్యుత్ అధికారుల దృష్టికి ఎన్నిమార్లు సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. కాగా విద్యుత్ సిబ్బంది అడ్డగోలుగా వేల రూపాయల బిల్లులు వేస్తూ తమకు తెలియకుండానే గ్రామ పంచాయతీ నిధుల నుంచి బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వైభవంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు మొదలుపెట్టారు. ముందుగా విష్వక్సేనునిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మదుపర్కపూజ, మాంగళ్యధారణ గావించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టోల్లో వికలాంగులకు అన్యాయం



మాట్లాడుతున్న బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్

చివ్వెంల(సూర్యాపేట): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోల్లో వికలాంగులకు అన్యాయం జరిగిందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీలు వెంటనే వికలాంగులకు కేటాయించే సీట్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వికలాంగుల తరఫున అభ్యర్థులను నిలబెడతామన్నారు. కార్యక్రమంలో కొల్లూరి ఈదయ్య, మధు, వీరయ్య, యల్లయ్య, అశోక్ రెడ్డి, సైదులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో పత్తి, ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, పోలీసు, రవాణా తదితర శాఖల అధికారులతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంటను బయోమెట్రిక్ విధానం ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు ద్వారా రైతుల వివరాలు ధ్రువీకరించి వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. ఈ విధానంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర పంటల సర్వే నిర్వహించి పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినందున ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 140 క్లస్టర్లలో వ్యవసాయ శాఖ అధికారులు పత్తి తేమ శాతం నమోదు చేయనున్నట్లు తెలిపారు. తేమ శాతం తక్కువ ఉంటే ఆరబెట్టి తీసుకురావాలని అన్నారు. సీసీఐ సూచనల మేరకు బయోమెట్రిక్ విధానం అమలు చేయడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక అధికారులు జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు నాణ్యత ప్రమాణాలతో కూడిన సర్టిఫికెట్‌ను ధ్రువీకరించాలని అన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలతో పాటు వరదలు వచ్చే ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని అన్నారు. ధాన్యం కొనుగోలుకు కేంద్రాల వారీగా సమన్వయం చేసుకొని క్లస్టర్ల వారీగా ధాన్యాన్ని తరలించేలా ఏఈఓలు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర గ్రేడ్- అ రూ.2203, కామన్ గ్రేడ్ రూ.2183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. మద్దతు ధరకు సంబంధించిన బ్యానర్లను కొనుగోలు కేంద్రాలలో ప్రదర్శించాలన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ ఇతర అనుబంధ శాఖల అధికారులు యాసంగి పంటల కొరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అందులో భాగంగా విత్తనాలు ఎన్ని అవసరం పడతాయో ముందే చేయాలన్నారు. అదేవిధంగా ఆయా పంటలకు ఎరువులు, రసాయన మందులు కూడా సరిపడా ఉండేలా తగిన ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్టీఓ, మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధి పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తును మార్చేది సోషలిజమే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

సూర్యాపేట: దేశ భవిష్యత్తును మార్చేది సోషలిజమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. సీపీఎం సూర్యాపేట జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం రెండోరోజు పట్టణంలోని విఘ్నేశ్వర ఫంక్షన్‌హాల్‌లో భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రపంచ మానవాళికి ఎర్రజెండే దిక్సూచి అని అన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని పాలస్తీనా–ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలను కేసీఆర్ గత తొమ్మిదిన్నరేళ్లలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి పదేళ్లవుతున్నా కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామన్నారు. అనంతరం పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం అనే అంశంపై పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడులు పి. సోమయ్య మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాల కార్యదర్శులు, గ్రామశాఖ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 20 నుంచి ధాన్యం కొనుగోళ్లు

- కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయండి
- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

సాక్షి,యాదాద్రి : ధాన్యం కొనుగోళ్లు ఈనెల 20నుంచి ప్రారంభించాలని, అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ భాస్కర్‌రావు ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. గన్నీ బ్యాగులు, తేమ యంత్రాలు, టెంట్లు, టార్పాలిన్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుడి వస్తుందని అంచనా ఉందని, అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 312 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించి నాణ్యతను నిర్దేశించాలని, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తూకం వేసిన వడ్లను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, రవాణాకు లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులకు ఏ చిన్న సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ భూదాన్‌పోచంపల్లి, బొమ్మలరామారం మండలం మండలాల్లో పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

## పంటల సాగుకు అవకాశం కల్పించాలి

చౌటుప్పల్: తమ సొంత పొలంలో వేసుకున్న బోరును వాల్టా చట్టం కింద సీజ్ చేయించడంతో పంటలు సాగు చేయలేకపోతున్నామని చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామపంచాయతీ మధిర తమ్మలోనిబావి గ్రామానికి చెందిన వాకిటి రాజశేఖర్‌రెడ్డి, రజిత దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తుమ్మలోనిబావి పరిధిలోని సర్వే నంబర్ 200లో గల తమ భూమిలో బోరు వేసుకొని మోటారును బిగించి పంటలు సాగుచేద్దామనుకుంటే కొందరు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో వాల్టా చట్టం ప్రకారం తమ బోరును సీజ్ చేశారని అన్నారు. బోరు సీజ్ కావడంతో పంటల సాగు చేయలేక జీవనాధారం కోల్పోయామని వాపోయారు. బోరును పునరుద్ధరించి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

## ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

తుంగతుర్తి: రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కుల, మత, ప్రాంత వర్గ విభేదాలు రెచ్చగొట్టొద్దని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొవద్దని సూచించారు. ప్రచార సమయంలో ర్యాలీలు, బహిరంగ సభల కోసం సంబంధిత అధికారుల అనుమతులు పొందాలన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ వాహనాలను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదన్నారు. అనంతరం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, ఈవీఎంల రాండమైజేషన్ గురించి వివరాలు తెలియజేశారు. అలాగే ప్రతినిధులందరి సమక్షంలో స్ట్రాంగ్‌రూం, అగ్రికల్చ ర్ మార్కెట్ కమిటీ గోదాంను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్టు తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ



తిరుమలగిరిలో చెక్‌పోస్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సూర్యాపేట-జనగామ ప్రధాన రహదారిపై వశిష్ఠ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. కార్యక్రమంలో నాగారం సీఐ శివశంకర్, తిరుమలగిరి ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రవీందర్, వెంకన్న, రమేష్, హరి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మను తీసుకొస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని తదితరులు



టీఎన్‌జీఓ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

## ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ కార్యాలయంలో బుధవారం టీఎన్‌జీఓ యూనియన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కాళిందిని, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి కిరణ్ కుమార్, కోశాధికారి జయరావు, మహిళా ఉద్యోగులు మాధవి, రమాదేవి, అనురాధ, శైలజ, నళిని, సునీత, లక్ష్మి, జ్యోతి, శేఖర్‌రెడ్డి, దయాకర్, ప్రదీప్, రాజశేఖర్‌రెడ్డి, భిక్షం తదితరులు పాల్గొన్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



# విద్య, ఉద్యోగ సమాచారం

### కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 52
» పోస్టుల వివరాలు: ఫిజియోథెరపిస్ట్-02, స్టాఫ్ నర్స్-24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్-08, మెడికల్ ఆఫీసర్-10, ఎల్‌జీఎస్-04, సపోర్టింగ్ స్టాఫ్-03, సెక్యూరిటీ గార్డ్-01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10 +2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.10.2023.
» వెబ్‌సైట్: krishna.ap.gov.in

### అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 56
» పోస్టుల వివరాలు:ఫార్మసిస్ట్ గ్రేడ్2-02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-02, రేడియోగ్రాఫర్-01, థియేటర్ అసిస్టెంట్-08, ల్యాబ్ అటెండెంట్ -02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్-03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో-28, ఆఫీస్ సబార్డినేట్-01, ప్లంబర్ -05, ఎలక్ట్రీషియన్-01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్-01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 21.10.2023.
» వెబ్‌సైట్: ananthapuramu.ap.gov.in

### ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత: బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.10.2023.
» వెబ్‌సైట్: prakasam.ap.gov.in

### విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్‌ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» పోస్టుల వివరాలు: ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్-05, ఆఫీస్ సబార్డినేట్-01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 25.10.2023.
» వెబ్‌సైట్: https://vizianagaram.ap.gov.in

# జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

**టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్ట్‌ల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..**

» 339 ఏఈ పోస్ట్‌లకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం




తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

**నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్ట్‌లు**

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్ట్‌లు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-145 పోస్ట్‌లు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్- 42 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-74 పోస్ట్‌లు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-3 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-జనరల్ రిక్రూట్‌మెంట్-25 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-49 పోస్ట్‌లు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్ట్‌లు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

**విద్యార్హతలు**

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

**వయసు**

జూలై 1, 2023 నాటికి 18-44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

**వేతనం**

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600-రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

**ఎంపిక ఇలా**

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

**వంద మార్కులకు రాత పరీక్ష**

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్-ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

**రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ**

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

**ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం**

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:అక్టోబర్ 29,2023
- రాత పరీక్ష తేదీ: డిసెంబర్ 3, 2023
- రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో.
- వెబ్‌సైట్: www.tsgenco.co.in

**రాత పరీక్షలో రాణించేలా**

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

**అన్వయ దృక్పథం**

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.